# సెమీ కండక్టర్ ప్రాజెక్టులకు ఆమోదం తెలపండి

- నూతన రైలు మార్గాలు మంజూరు చేయండి
- కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయండి
- కేంద్ర ఐటి, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సిఎం విజ్ఞప్తి

అశ్వినీ వైష్ణవ్‌ను కలిసిన సిఎం రేవంత్, మంత్రులు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో సెమీకండక్టర్ ప్రాజెక్టులకు త్వరగా ఆమోదం తెలపాలని కేంద్ర ఐటీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, నూతన ఆవిష్కరణలకు అనుకూలమైన వాతావరణం, ప్రపంచ స్థాయి పరిశోధన, అభివృద్ధి కేంద్రాలు తెలంగాణలో ఉన్నందున ప్రతిపాదిత అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజీ టెక్నాలజీస్ ప్రాజెక్ట్, మైక్రో ఎల్ఇడి డిస్‌ప్లే ఫ్యాబ్ ప్రాజెక్ట్ క్రిస్టల్ మ్యాట్రిక్స్‌కు ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రిని కోరారు. కేంద్ర ఐటీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను రైల్ భవన్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా ముచ్చెర్లలో హైటెక్ ఎలక్ట్రానిక్స్ పార్క్ ఏర్పాటుకు ఇఎంసి 2.0 పథకం కింద తెలంగాణ వినతిని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రీజనల్ రింగు రోడ్డు సమీపంలో నూతన ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.

తెలంగాణలో రైల్వే అనుసంధానత పెంపు కోసం నూతన ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డుకు సమాంతరంగా రీజనల్ రింగ్ రైలు ప్రాజెక్టును ప్రతిపాదించామని... ఇందుకు రైల్వే బోర్డు ఇప్పటికే ఫైనల్ లొకేషన్ సర్వేకు అనుమతి ఇచ్చిందని తెలిపారు. రూ.ఎనిమిది వేల కోట్ల విలువైన ఈ రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్ట్‌కు త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరారు. రీజినల్ రింగ్ రైలుతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అనుసంధానత పెరగడంతో పాటు హైదరాబాద్ నగరంలోని ప్రధాన స్టేషన్లలో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని వివరించారు. రీజనల్ రింగు రైలు ప్రాజెక్టుతో గ్రామీణ పేదరికం తగ్గడంతో పాటు పట్టణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. హైదరాబాద్ డ్రైపోర్ట్ నుంచి బందరు ఓడ రేవుకు అనుసంధానంగా రైలుమార్గం మంజూరు చేయాలని కోరారు. ఔషధాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఫుడ్ ప్రాసెసింగ్ ఉత్పత్తుల ఎగుమతులకు ఈ మార్గం దోహదపడుతుందని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో రైల్వే ఆపరేషన్స్‌ను మరింత సమర్థంగా నిర్వహించేందుకు కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని, ప్రయాణికులకు భద్రత, వేగవంతమైన సేవలు అందించేందుకు కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. తెలంగాణలో వివిధ ప్రాంతాల అనుసంధానత, పారిశ్రామిక, వ్యవసాయక ఎగుమతులు, దిగుమతుల కోసం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నూతన రైలు మార్గాలు మంజూరు చేయాలని, ఇందులో భాగంగా వికారాబాద్-కృష్ణా (122 కి.మీ.- అంచనా వ్యయం రూ.2,677 కోట్లు, కల్వకుర్తి-మాచర్ల (100 కి.మీ.-అంచనా వ్యయం రూ.2 వేల కోట్లు, డోర్నకల్-గద్వాల (296 కి.మీ.-అంచనా వ్యయం రూ.6,512 కోట్లు), డోర్నకల్-మిర్యాలగూడ (97 కి.మీ.-అంచనా వ్యయం 2,184 కోట్లు) మార్గాలను వంద శాతం రైల్వే శాఖ వ్యయంతో మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో ఎంపిలు పోరిక బలరాం నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, కుందూరు రఘువీర్ రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, సురేశ్ షెట్కార్, రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, ఆర్అండ్‌బి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎప్‌సెట్ ఇంజనీరింగ్ సీట్ల కేటాయింపు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎప్‌సెట్ (ఎంసెట్) మొదటివిడత కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా శుక్రవారం సాంకేతిక విద్యాశాఖ సీట్లు కేటాయించనుంది. రాష్ట్రంలో 172 ఇంజనీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో 83,054 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈనెల 12న మాక్ కౌన్సెలింగ్‌లో భాగంగా 77,154 మందికి సాంకేతిక విద్యాశాఖ సీట్లు కేటాయించింది. 5,900 సీట్లు మిగిలాయి. మరోవైపు సరిపోయినన్ని వెబ్‌ఆప్షన్లను నమోదు చేయకపోవడం, ఇతర కారణాల వల్ల 16,905 మందికి సీట్లు కేటాయించలేదు. దీంతో అప్రమత్తమైన అభ్యర్థులు ఎప్‌సెట్ మొదటి విడతలో వెబ్‌ఆప్షన్ల మార్పుచేర్పుల అవకాశాన్ని వినియోగించుకున్నారు. ఈనెల 13 నుంచి 15 వరకు దాదాపు సగం మంది అభ్యర్థులు ఆప్షన్లను సవరించారు. రాష్ట్రంలో 95,256 మంది అభ్యర్థులు ఎప్‌సెట్ ఇంజినీరింగ్ ప్రవేశాలకు సంబంధించిన ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. వారిలో 94,354 మంది అభ్యర్థులు 59,31,279 వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారు.

రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

## ఆసిఫాబాద్‌లో భారీ వర్షం

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

ఆసిఫాబాద్‌లో బుధవారం రాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం వరకూ కురిసిన భారీ వర్షానికి పట్టణం అతలాకుతలమైంది. భారీ వర్షంతో జిల్లా కేంద్రాల్లోని బ్రాహ్మణవాడ, పైకాజినగర్, జూబ్లీ మార్కెట్ ప్రాంతాల్లోని రహదారులు మోకాళ్ల లోతు నీటితో కాలువలను తలపించాయి. డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. జిల్లాగా ఆవిర్భవించి ఎనిమిదేళ్లు, మున్సిపాలిటీగా ఆవిర్భవించి 18 నెలలు అవుతున్నప్పటికీ కనీస రహదారులు, డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గురువారం కురిసిన భారీ వర్షానికి ప్రజల ఇబ్బందులు మరింత రెట్టింపయ్యాయి. మూడు గంటలపాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి భారీగా నీరు నిల్వడంతో ఇబ్బందులు పడ్డారు. పట్టణంలో కనీస రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థపై అధికారులు గాని, ప్రజాప్రతినిధులు గాని దృష్టి సారించకపోవడంపై జిల్లా ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. పాత ఆర్టీవో కార్యాలయం ఎదురుగా ప్రధాన రహదారి కూడా గుంతలు ఉండటం వల్ల వాహన చోదకులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ ప్రణాళిక అమలు చేస్తూ రోడ్లు, డ్రయినేజీలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

## 'పేట' సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎసిబి సోదాలు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం ఎసిబి అధికారులు సోదాలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎసిబి డిఎస్‌పి సుదర్శన్ మాట్లాడుతూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్‌కు అనుమతి ఉండదన్నారు. రిజిస్ట్రేషన్ చేపించేవాళ్లు, అమ్మే వాళ్లు మాత్రమే కార్యాలయంలో ఉండాలన్నారు. కానీ ఇక్కడ చూస్తే డాక్యుమెంట్ రైటర్లు లేనిదే పనిచేయడం లేదని తెలుస్తోందన్నారు. అలాగే, ఎలాంటి లావాదేవీలకు సంబంధం లేని రూ.7,550 నగదు గుర్తించామన్నారు. రిజిస్ట్రార్ క్యాబిన్‌లో క్రయవిక్రయదారులు మాత్రమే ఉండాల్సి ఉండగా, ఏకంగా 12 మంది ఉన్నారని తెలిపారు. రిజిస్ట్రేషన్ అయిన తర్వాత డాక్యుమెంట్లను డిస్పాచ్ చేయాలని, కానీ దాదాపు 30 రిజిస్ట్రేషన్ అయిన డాక్యుమెంట్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే ఉన్నాయన్నారు. అదేవిధంగా ఫ్లాట్స్, వెంచర్స్‌లలో రిజిస్ట్రేషన్ చేసిన డాక్యుమెంట్లపై వాటి యజమానుల ఫోన్ నంబర్లు మాత్రమే ఎంటర్ చేయాల్సి ఉంటుందని, కానీ ఇక్కడ డాక్యుమెంట్ రైటర్ల ఫోన్ నంబర్లు ఎంటర్ చేసి ఉంచడాన్ని గమనించామని తెలిపారు.

# ఇంజనీరింగ్ బి కేటగిరీ సీట్ల భర్తీకి రేపు నోటిఫికేషన్

- రేపటినుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ఆగస్టు 10 నాటికి సీట్ల భర్తీ ప్రక్రియ పూర్తి చేయాలి
- మెరిట్ ప్రకారమే అభ్యర్థులకు సీట్లు ఇవ్వాలి
- మార్గదర్శకాలు విడుదల చేసిన ఉన్నత విద్యామండలి

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రయివేటు (మైనార్టీ, నాన్‌మైనార్టీ) ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో బి కేటగిరీలోని సీట్ల భర్తీకి శనివారం నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ గురువారం మార్గదర్శకాలను విడుదల చేశారు. శనివారం నుంచి ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో నేరుగా దరఖాస్తుల సమర్పణ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. వచ్చేనెల పదిలోగా బి కేటగిరీ సీట్ల భర్తీ ప్రక్రియను పూర్తి చేయాలని కాలేజీ యాజమాన్యాలను ఆదేశించారు. మూడు దినపత్రికల్లో (ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ) ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యాలు బీ కేటగిరీ సీట్ల భర్తీకి సంబంధించి ప్రత్యేకంగా నోటిఫికేషన్ ఇవ్వాలని సూచించారు. వచ్చిన దరఖాస్తుల వివరాలను ప్రతిరోజూ కాలేజీలోని నోటీసు బోర్డులో, వెబ్‌సైట్‌లో ప్రదర్శించాలని తెలిపారు. ఇంటర్మీడియెట్‌లో 45 శాతం (రిజర్వుడు కేటగిరీ వారికి 40 శాతం) మార్కులొచ్చిన విద్యార్థులు దరఖాస్తు చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. రాష్ట్రంలోని ప్రయివేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 70 శాతం సీట్లు కన్వీనర్ కోటాలో, 30 శాతం సీట్లు బి కేటగిరీలో భర్తీ అవుతాయని వివరించారు. ఇందులో నాన్ రెసిడెంట్ ఇండియన్ (ఎన్ఆర్ఐ) కోటా కింద 15 శాతం, యాజమాన్య (మేనేజ్‌మెంట్) కోటా కింద 15 శాతం సీట్లు భర్తీ చేయాలని పేర్కొన్నారు. బి కేటగిరీలోని సీట్ల వివరాలను బ్రాంచ్‌ల వారీగా ప్రకటించాలని ఆదేశించారు. జెఇఇ మెయిన్స్, ఎప్‌సెట్ ర్యాంకుల ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేయాలని వివరించారు. ఇంకా సీట్లు మిగిలితే ఇంటర్‌లో మార్కుల ఆధారంగా సీట్లివ్వాలని తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి మెరిట్ ప్రకారమే సీట్లు భర్తీ చేయాలని కోరారు. బ్రాంచ్ వారీగా మెరిట్ జాబితాను ప్రకటించాలని సూచించారు. వచ్చేనెల పదో తేదీ నాటికి బి కేటగిరీ సీట్ల భర్తీ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. అదేనెల 28 నాటికి భర్తీ చేసిన సీట్ల వివరాలను ఉన్నత విద్యామండలికి సమర్పించాలని సూచించారు.

**ప్రముఖ ప్రయివేటు కాలేజీల్లో సీట్లు రిజర్వు**

ఇప్పటికే కొన్ని ప్రముఖ ప్రయివేటు ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యాలు సీట్లను రిజర్వు చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. యాజమాన్యాలతో వేలాది మంది విద్యార్థులు సంప్రదించి సీట్లను ముందే పొందినట్టు తెలుస్తున్నది. ముఖ్యంగా డిమాండ్ ఉన్న కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ) అనుబంధ బ్రాంచీల్లో ఎక్కువ మంది విద్యార్థులు సీట్లు రిజర్వు చేసుకున్నట్టు సమాచారం. నోటిఫికేషన్ విడుదలయ్యాక పద్ధతి ప్రకారం ఆ విద్యార్థులు దరఖాస్తు చేసినట్టు కాలేజీ యాజమాన్యాలు ప్రకటిస్తాయని విద్యావేత్తలు చెప్తున్నారు. యాజమాన్య కోటాకు సంబంధించి కాలేజీని బట్టి సిఎస్ఈ సీటు రూ.పది లక్షల నుంచి రూ.24 లక్షల వరకు డొనేషన్ వసూలు చేస్తున్నట్టు తెలుస్తున్నది. ఇందుకు సంబంధించి ఇప్పటికే కాలేజీ యాజమాన్యాలు, విద్యార్థులు, తల్లిదండ్రుల మధ్య బేరసారాలు పూర్తయినట్టు సమాచారం. సిఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషిన్ లెర్నింగ్, డేటాసైన్స్, సైబర్ సెక్యూరిటీ, సీఎస్ఈ ఐవోటీ, ఐటీ వంటి కోర్సులకు భారీగా డిమాండ్ ఉన్నది. ఈ కోర్సుల్లో చేరేందుకు ఎక్కువ మంది విద్యార్థులు ఆసక్తిని కనబరుస్తున్నారు. ఉన్నత విద్యామండలి మార్గదర్శకాలను బట్టి పత్రికల్లో నోటిఫికేషన్లు ఇవ్వడం, విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించినట్టు చేయడం నామమాత్రమేనని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

రాచకొండ సిపి సుధీర్ బాబు ఎదుట లొంగిపోయిన మావోయిస్టు దంపతులు

# మావోయిస్టు దంపతుల లొంగుబాటు

- ఒక్కొక్కరిపై రూ.20 లక్షల రివార్డు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

దశాబ్దాలుగా మావోయిస్టు ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్న మావోయిస్టు దళ సభ్యులు, దంపతులు మాల సంజీవ్ అలియాస్ లెంగు దాదా, పెరుగుల పార్వతీ అలియాస్ దీనా వయోభారంతో గురువారం రాచకొండ సిపి డాక్టర్ సుధీర్ బాబు ఎదుట లొంగిపోయారు. పూర్వ వైభవాన్ని వీడి ప్రజా ప్రవంతిలో చేరిన ఈ దంపతులు ఒక్కొక్కరిపై రూ.20 లక్షల చొప్పున రివార్డు ఉండటం గమనార్హం. ఈ మేరకు ఎల్బీ నగర్‌లోని సిపి క్యాంప్ కార్యాలయంలో కమిషనర్ మీడియాకు వివరాలు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 379 మంది మావోయిస్టులు లొంగిపోయినట్టు తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యాప్రాల్ నివాసి అయిన మాల సంజీవ్ అలియాస్ లెంగు దాదా 1980లో సిపిఐ (ఎంఎల్) పీపుల్స్ వార్‌లో చేరి గద్దర్‌కు ముఖ్య అనుచరునిగా, దళ సభ్యునిగా పని చేశారు. ప్రస్తుతం డికెఎస్‌డిసి సెక్రటేరియట్ సభ్యుడిగా ఉన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యురాలు (ఎస్‌సిఎం, డికెఎస్‌జెడ్‌సి), చైతన్య నాట్య మంచ్(డీకేఎస్‌జేడీసీ) సాంస్కృతిక ఉప సభ్యులు దీనా 1992లో మావోయిస్టు పార్టీలో చేరారు.

**పోరు వద్దు- ఊరు ముద్దు : రాచకొండ సిపి**

మావోయిస్టులు పోరుబాటను వీడి ఊరు వాడ పట్టాలని రాచకొండ సిపి డాక్టర్ సుధీర్‌బాబు మావోయిస్టు నేతలకు సూచించారు. అజ్ఞాత మావోయిస్టులు నక్సలిజాన్ని వదిలి వారి గ్రామాలకు తిరిగి వచ్చినట్టయితే రాష్ట్ర ప్రభుత్వం వారికి నగదు రివార్డు, పునరావాసం, సంక్షేమ పథకాలు అందేలా తగు చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. జనజీవన ప్రవంతిలో కలిసిన మావోయిస్టులకు జనం నుంచి కూడా సహకారం అందుతుందని, అందుకు తగు చర్యలు చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఒటి అడిషనల్ డిసిపి షాకీర్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

# హామీల అమలుకు పోరాటం

- తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాంనాయక్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

గిరిజనులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ గిరిజన హక్కుల దినోత్సవం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడుతున్నట్టు తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరాం నాయక్ పిలుపునిచ్చారు. తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా వైరా పట్టణంలోని బోడేపూడి భవనంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల డిక్లరేషన్ పేరుతో ఎన్నికల మ్యానిఫెస్టోలో గిరిజనులకు 15 రకాల హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన ఈ రెండేండ్లలో ఒక్క హామీనీ అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో 10 శాతం ఉన్న గిరిజన జనాభాకు అనుగుణంగా రెండు మంత్రి పదవులు ఇవ్వాల్సి ఉండగా ఒక్కరికి మాత్రమే ఇచ్చి సామాజిక న్యాయానికి తూట్లు పొడిచిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అంబేద్కర్ అభయహస్తం పేరుతో ప్రతి గిరిజన కుటుంబానికి రూ.12 లక్షల ఆర్థిక సహాయం ఇస్తామని, మైదాన ప్రాంత గిరిజనుల అభివృద్ధికి రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన 5 ఐటీడీఏలను ఏర్పాటు చేస్తామని చెప్పారన్నారు. సమ్మక్క సారక్క పథకం ద్వారా ప్రతి తండా, గూడెం, గ్రామ పంచాయతీలకు ప్రతి ఏటా రూ.25 లక్షలు ఇస్తామని, మూడు ఎస్టీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ప్రతి కార్పొరేషన్‌కు ప్రతి ఏటా బడ్జెట్‌లో రూ.750 కోట్లు ఇస్తామంటూ హామీ ఇచ్చిందన్నారు. ఇందులో ఒక్క హామీ కూడా అమలు చేయలేదని తెలిపారు. రెండేండ్లుగా బకాయి పడ్డ రూ.154 కోట్ల బెస్ట్ అవైలబుల్ నిధులను విడుదల చేయడం లేదని, దీని వల్ల 25 వేలమంది ఎస్సీ, ఎస్టీ, పేద విద్యార్థులు రోడ్డున పడ్డారన్నారు. రాష్ట్రంలో పోడు భూములను సాగు చేస్తున్న గిరిజనులపై అటవీ శాఖ అధికారులు నిర్దాక్షిణ్యంగా దాడి చేస్తున్నారని విమర్శించారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం ఎర్రబోడు ప్రాంతంలో మహిళలని కూడా చూడకుండా మగ అధికారులు ఎక్కడపడితే అక్కడ చేతులు వేస్తూ జుట్టు పట్టి అమానుషంగా దాడి చేశారని ఆరోపించారు.

# వికలాంగుల ప్రాతినిధ్యం కోసం చట్టం చేయాలి

- ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.అడివయ్య

**హైదరాబాద్ బ్యూరో :** వికలాంగులకు పెన్షన్ రూ.6 వేలకు పెంచాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగుల ప్రాతినిధ్యం కోసం అసెంబ్లీలో చట్టం చేయాలని ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.అడివయ్య డిమాండ్ చేశారు. ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వికలాంగులు ధర్నా నిర్వహించి, కలెక్టరేట్ ఏఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులను మోసం చేస్తుందన్నారు. పెన్షన్ పెంచకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడిస్తామని హెచ్చరించారు. అధికారంలోకి వచ్చి 18 నెలలవుతున్నా పెన్షన్ ఎందుకు పెంచడం లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వికలాంగులకు ఇచ్చిన మాట తప్పిన ముఖ్యమంత్రికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. పెన్షన్ పెంపు కోసం 42 లక్షల మంది చేయూత లబ్దిదారులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. చేయూత పెన్షన్స్ కోసం రాష్ట్రంలో 24.85 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వికలాంగుల కార్పొరేషన్‌ను బలోపేతం చేసి, మూసేసిన టీసీపీసీ కేంద్రాలను పున:ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లా కేంద్రంలో టీసీపీసీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే తమిళనాడు, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో స్థానిక సంస్థల్లో వికలాంగులకు ప్రాతినిధ్యం కల్పించేందుకు అసెంబ్లీలో చట్టాలు చేసి అమలు చేస్తున్నారన్నారు. తెలంగాణలో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. సంగారెడ్డి జిల్లాలో పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగి అనేక మంది వికలాంగులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగవైకల్యం ఏర్పడటానికి కారణమవుతున్న పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్లలో వికలాంగులకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని, 2016 ఆర్పీడీ చట్టం ప్రకారం ఇందిరమ్మ ఇండ్లలో 25 శాతం అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వికలాంగుల చట్టాలను అమలు చేయడంలో జిల్లా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోపు పెన్షన్ పెంచకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు యం.బస్వరాజు, కార్యదర్శి కొనింటి నర్సిములు, జిల్లా ఉపాధ్యక్షులు జయలక్ష్మి, రాంచందర్, రాజ్‌కుమార్, రాములు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# యూరియా కోసం క్యూలైన్‌లో చెప్పులు

- హనుమకొండ జిల్లా పరకాలలో పరిస్థితి

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

ఖరీఫ్ పంటలకు కావాల్సిన యూరియా కోసం రైతులు తిప్పలు పడాల్సి వస్తోంది. సీజన్ ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నప్పటికీ యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. సహకార సంఘాల ద్వారా యూరియా పంపిణీ జరుగుతున్నప్పటికీ డిమాండ్ మేరకు సప్లయ్ లేకపోవడంతో రైతులు సొసైటీల వద్ద పడిగాపులు పడుతున్నారు. గురువారం హనుమకొండ జిల్లా పరకాల వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వద్ద మాదారం, పరకాల వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో యూరియా పంపిణీ చేస్తుండటంతో పెద్ద ఎత్తున రైతులు అక్కడికి చేరుకొని లైన్ కట్టారు. ఉదయం 6 గంటల నుంచి ప్రారంభమైన ఈ లైన్ మధ్యాహ్నం రెండు గంటలకు సైతం కొనసాగడంతో రైతులు లైన్‌లో నిల్చోలేక పరస్పర అంగీకారంతో చెప్పులను లైన్‌లో పెట్టడం గమనార్హం. వ్యవసాయ పనులు చేసుకోవాల్సిన తాము క్యూ లైన్లలో నిలబడాల్సి రావటం ఏంటని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతును రాజును చేస్తామని చెబుతున్న ప్రభుత్వం ఇలా క్యూ లైన్‌లో నిలబెట్టి యూరియా కోసం బికార్లను చేస్తారా అంటూ ప్రశ్నిస్తున్నారు.

# పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి పెంపునకు సహకరించండి

- సిఎం రేవంత్‌కు కిషన్‌రెడ్డి లేఖ

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి పెంపునకు సంబంధించిన ప్రాజెక్టుల విషయంలో కేంద్రానికి రాష్ట్ర సర్కారు సహకరించాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి కోరారు. గురువారం ఈ మేరకు సిఎం ఎ.రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. తెలంగాణలోని అధిక సౌర విద్యుదుత్పత్తి సామర్థ్యం గల జోన్లను గుర్తించి ఆయా ప్రాంతాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లను అభివృద్ధి చేయడానికి కేంద్రం సిద్ధంగా ఉందని ప్రకటించారు. గ్రిడ్ స్టెబిలిటీ, ఎనర్జీ రిలయబిలిటీలను మరింత పెంచేలా అత్యాధునిక బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ అభివృద్ధి చేయడానికి సిద్ధమని తెలిపారు. క్రిటికల్ బ్యాలెన్సింగ్ కెపాసిటీని అందించేందుకు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు సాధ్యాసాధ్యాల అధ్యయనం చేసి అమలు చేస్తామని హామీనిచ్చారు. ప్రాజెక్టుల అమలును వేగవంతం చేయడానికి, స్థానిక ఆర్థిక ప్రయోజనాలను పెంచడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలతో, కేంద్ర ప్రభుత్వ బొగ్గు కంపెనీలు స్వతంత్ర ప్రాతిపదికన జాయింట్ వెంచర్ మోడల్స్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఆ ప్రాజెక్టులకు భూ కేటాయింపు, భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు కావాలని కోరారు. రాష్ట్రంలో హరితాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో సహకారం అందిస్తోందనీ, ఇది రాష్ట్రాభివక్శిద్ధికి, సుస్థిర విద్యుత్ స్థాపన సామర్థ్యాన్ని ఏర్పాటు చేసుకోవడానికి కీలకంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ దీర్ఘకాల ప్రణాళికలైన ఇంధన భద్రత, పర్యావరణ పరిరక్షణను సాకారం చేసుకునేందుకు, అభివృద్ధి అవకాశాలను సమతుల్యం చేసుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం అత్యంత కీలకమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణతోపాటుగా ఆత్మనిర్భరతతో కూడిన భవిష్యత్‌ను ఏర్పరుచుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నిర్మాణాత్మక సహకారంలో తమ చొరవ కీలమని తెలిపారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- పంటల సాగు కోసం సింగూరు ఎడమ కాలువ ద్వారా నీటి విడుదల

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తున్నదని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గురువారం సంగారెడ్డి జిల్లాలోని సింగూర్ ప్రాజెక్ట్ ఎడమ కాలువ ద్వారా అందోల్ నియోజకవర్గంలోని పుల్కల్, చౌటకూర్, ఆందోల్ మండలాల్లో ఖరీఫ్ పంటల సాగు కోసం వంద క్యూసెక్కుల నీటిని మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సంవత్సరం ఆశించిన స్థాయిలో వర్షాలు లేకున్నప్పటికీ సాగు కోసం సింగూర్ ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా నియోజకవర్గంలోని ఆయకట్టుకు ప్రభుత్వం మొదటి విడతలో వంద క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు తెలిపారు. ఈ నీటితో ఆయకట్టు పరిధిలోని చెరువులు, కుంటలు నిండుతాయన్నారు. సింగూరు నుంచి ఆయకట్టుకు నీరు విడుదల కావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**విద్యాసంస్థలను తనిఖీ చేసిన మంత్రి**

సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల కేంద్రంలోని రెసిడెన్షియల్, కెజిబివి, మోడల్ పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలలను మంత్రి దామోదర రాజనర్సింహ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చనున్నట్టు తెలిపారు. ఆయా విద్యాసంస్థల్లోని సమస్యలను త్వరలో పరిష్కరించనున్నట్టు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యాసంస్థల్లో శానిటేషన్‌పై దృష్టి పెట్టడంతో పాటు, సీఎస్ఆర్ నిధులతో ఆయా విద్యాసంస్థల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఆందోల్ ఆర్డీఓ పాండు, తహసీల్దార్ కృష్ణ. ఇరిగేషన్ అధికారి నాగరాజు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ రామచంద్రారెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, గోవర్ధన్, మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దుర్గారెడ్డి, యూత్ అధ్యక్షులు ఉదయ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్ష చేస్తున్న బాలానగర్ వాసులు

# భూ కబ్జాలకు వ్యతిరేకంగా 'రిలే నిరాహార దీక్ష'

- మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట ప్రజల ధర్నా

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

భూకబ్జాలకు వ్యతిరేకంగా "మా ఊరి హక్కుల కోసం, భూమి రక్షణ కోసం" అంటూ గురువారం మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట పట్టణ ప్రజలు ధర్నా నిర్వహించారు. అనంతరం శాంతియూత రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా బాలానగర్ పట్టణ వాసులు కరాటే రవికుమార్, కెవి మధు మాట్లాడుతూ.. తమ ఊరిలోని దేవాలయాల భూములు, ప్రభుత్వ భూములను కొంతమంది అక్రమంగా ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. ఈ విషయంపై గ్రామ ప్రజలు అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోకపోవడం లేదని ఆరోపించారు. అంతేకాకుండా, గ్రామంలో ఉన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రజావాణిలో జిల్లా కలెక్టర్, తహశీల్దార్‌కు సైతం వినతి పత్రాలు అందజేశామన్నారు. ఇప్పటికైనా తమ గ్రామ భూములను కాపాడి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ పట్టణ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అధ్యాపకులను నియమించండి

- ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు ముధోల్ ఎమ్మెల్యే రామారావు పవార్ వినతి

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలోని ముధోల్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అవసరమైన అధ్యాపకులను నియమించాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పాటిల్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మన్ వి బాలకృష్టారెడ్డిని గురువారం హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్‌లో రామారావు పాటిల్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఆ కాలేజీలో తక్కువ అధ్యాపకులున్నారని తెలిపారు. దీంతో విద్యార్థులు అనేక సవాళ్లను, ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరం (2025-26)లో బిఎ, బికాం, బిఎస్‌సి కోర్సుల్లో విద్యార్థులు ప్రవేశాలను పొందారని వివరించారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో గెస్ట్ లెక్చరర్లను భర్తీ చేసుకునేందుకు ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసిందని గుర్తు చేశారు. ఆ జిఒ ప్రకారం ముధోల్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో గెస్ట్ లెక్చరర్లతోపాటు బోధనేతర సిబ్బందిని నియమించుకునేందుకు అవకాశం లేదని తెలిపారు. ఈ నియోజకవర్గం సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతంగా గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. విద్యార్థులు ఎక్కువ మంది సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారేనని వివరించారు. ప్రభుత్వరంగంలోని విద్యాసంస్థల్లోనే చదివేందుకు ఆసక్తి చూపుతారని తెలిపారు. ఫీజులు చెల్లించి ఉన్నత విద్యను అభ్యసించే స్థోమత లేదని పేర్కొన్నారు. ఈ కాలేజీకి అవసరమైన సిబ్బందిని కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై బాలకిష్టారెడ్డి సానుకూలంగా స్పందించారు. వీటిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

# 'ఉపాధి'పై ముప్పేట దాడి

- హాజరుపై రోజూ తనిఖీ చేయాలని రాష్ట్రాలకు కేంద్రం లేఖ
- ఆన్‌లైన్ హాజరుపై అనేక అభ్యంతరాలు
- నెట్ సిగ్నల్స్ సరిగా రాక, యాప్ పనిచేయక ఇక్కట్లు
- మరింత మందిని 'ఉపాధి'కి దూరం చేసేలా కేంద్రం ఆదేశాలు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన, సామాజిక అంతరాలను తగ్గించేందుకు తీసుకొచ్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మొదటి నుంచీ దాడి చేస్తూ వస్తున్నది. ఓ పక్క నిధులు పెంచాలనే డిమాండ్ వస్తుంటే మోడీ సర్కారు మాత్రం కేంద్ర బడ్జెట్‌లో ఏటేటా తగ్గిస్తూ పోతున్నది. చట్టం అమలు విషయంలో రాష్ట్రాల హక్కులను హరిస్తున్నది. మొదటి అర్ధ వార్షికంలో రాష్ట్రాలకు కేటాయించిన నిధుల్లో 60 శాతం మించి ఖర్చుపెట్టొద్దని ఇటీవలే కొర్రీలు పెట్టి కూర్చున్నది. తాజాగా నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్(ఎన్ఎంఎంఎస్ యాప్) అమలు సరిగా జరగట్లేదనీ, ఇక రోజువారీ తనిఖీలు చేయాల్సిందేనని ఆదేశాలు జారీ చేసింది. గ్రామాల్లోని పని ప్రదేశాల్లో, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో నెట్ సరిగా అందుబాటులోలేక ఎన్ఎంఎంఎస్ యాప్ సరిగా పనిచేయట్లేదనే విమర్శలు వెల్లువెత్తున్న తరుణంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ రాష్ట్రాలకు రాసిన లేఖ పుండుమీద కారం చల్లడం లాంటిదే. కుక్కను చంపే ముందు పిచ్చికుక్క అని ముద్ర వేసినట్టుగానే ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే విషయంలో అనేక తప్పుడు ప్రచారాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. వ్యవసాయ పనులు లేని సమయంలో కార్మికులకు ఇతోధికంగా దోహదపడాలనే ఉద్దేశంతో తెచ్చిన ఈ చట్టాన్ని ఇప్పుడు వ్యవసాయ పనులకు అనుసంధానం చేయాలని కేంద్రం రాష్ట్రాల మీద ఒత్తిడి తెస్తున్న విషయమూ విదితమే. నిధులలేమితో తండ్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రం చెప్పిన విషయాలను చచ్చినట్టు అమలు చేస్తున్నాయి. ఎన్ఎంఎంఎస్ యాప్ అమలు విషయంలో కేంద్రం చెప్పినట్టు నడుచుకోవాలని కలెక్టర్లకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ సృజన ఇటీవల లేఖలు కూడా రాశారు.

**రోజూ తనిఖీలు తప్పనిసరి అంటూ హుకూం..**

క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లనే ఇలాంటి అక్రమాలు జరుగుతున్నాయి. దీంతో చట్టం అమలులో పారదర్శకత లోపిస్తున్నది. పారదర్శకత, జవాబుదారీ తనం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించింది. గ్రామస్థాయిలో 100 శాతం కార్మికులకు సంబంధించి అప్‌లోడ్ చేసిన ఫొటోలను ఫీల్డు అసిస్టెంట్లు వంద శాతం తనిఖీ చేయాలనే నిబంధన పెట్టింది. మండల స్థాయిలో 200 ఫొటోలు లేదా అప్‌లోడ్ చేసిన ఫొటోల్లో 20 శాతం ఖచ్చితంగా తనిఖీ చేయాలని స్పష్టం చేసింది. జిల్లా స్థాయిలో జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్(డీపీసీ) కనీసం 30 ఫొటోలు, సిబ్బంది వంద ఫొటోలుగానీ, పది శాతంగానీ తనిఖీ చేయాలని ఆదేశించింది. రాష్ట్రస్థాయిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కనీసం 20 ఫొటోలు, ఆ శాఖ సిబ్బంది కనీసం వంద ఫొటోలుగానీ, ఐదు శాతం ఫొటోలుగానీ తనిఖీ చేయాలని సూచించింది.

**క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులు**

కేంద్రం చెబుతున్నది క్షేత్రస్థాయిలో పరిస్థితులకు చాలా భిన్నంగా ఉంది. తెలంగాణలో చాలా ప్రాంతాల్లో నెట్ సౌకర్యం లేదు. ఏజెన్సీ ప్రాంతాల్లో కనీసం ఫోన్లు కూడా కలవని పరిస్థితి. ఇప్పటికే ఎన్ఎంఎంఎస్ యాప్ అమలులో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటివరకూ ఆన్‌లైన్ మస్టర్ యాప్‌పై కింది స్థాయి సిబ్బందికి శిక్షణ కూడా ఇవ్వలేదు. డేటా రీచార్జిని ఫీల్డు అసిస్టెంట్లు సొంత ఖర్చులతో చేయించుకుంటున్న పరిస్థితి. పని ప్రదేశంలో నెట్‌సరిగా రాక సిగ్నల్ వచ్చే ప్రాంతాలకెళ్లి ఫీల్డు అసిస్టెంట్లు ఫొటోలు తీస్తున్న పరిస్థితి. దీంతో కూలీలు హాజరు కోసం గంటల తరబడి నిల్చోవలసిన దుస్థితి. ఒక కార్మికుడు నిమిషం సమయం తీసుకున్నా... అక్కడ పనిచేసే 200 కార్మికుల ఫొటోలు అప్‌లోడ్ చేయాలంటే కనీసం మూడు గంటల పడుతుంది.

మళ్లీ మధ్యాహ్నం పనిప్రదేశం నుంచి ఫొటోలతో మళ్లీ హాజరు నమోదు చేయడం తలకుమించిన భారంగా మారుతున్నదనీ, ఫోన్లలో చార్జింగ్ అయిపోతే ప్రత్యామ్నాయ మార్గాలు కూడా లేవని ఫీల్డు అసిస్టెంట్లు వాపోతున్నారు. గతంలో ఫీల్డు అసిస్టెంట్లు మాత్రమే కాకుండా 20 నుంచి 30 మంది కూలీలకు గుంపు పెద్దగా ఒక మేట్ ఉండేవారు. ఎన్ఎంఎంఎస్ యాప్ తీసుకొచ్చిన తర్వాత ఆ వ్యవస్థకు చరమగీతం పాడారు. ఆన్‌లైన్ హాజరు విషయంలో కూలీలు కూడా ఒకింత అసహనానికి గురవుతున్నారు. రోజంతా పనిచేసినా రూ.100 నుంచి రూ.200 లోపు మాత్రమే దక్కటం, ఫొటోల అప్‌లోడ్ విషయంలో గంటల తరబడి వేచిఉండటం, ఆధార్, జాబ్ కార్డులతో బ్యాంకు పాస్‌బుక్కులతో లింకు చేసిన తర్వాత వేతనాల చెల్లింపులో అనేక ఇబ్బందులు ఎదురవుతుండటం వల్ల ఆ పని పట్ల కూలీలకు ఆసక్తి తగ్గుతున్నది. కాదుకాదు...పొమ్మనలేక పొగబెట్టినట్టు కేంద్రమే ఉపాధి కూలీలను పని నుంచి తప్పుకునేలా చేస్తున్నది. గ్రామీణ పేదలుగా ఉన్న దళితులు, గిరిజనులు, బడుగుబలహీన వర్గాల వారికి వంద రోజుల పనిని కల్పించాలనే బాధ్యత నుంచి కేంద్రంలోని మోడీ సర్కారు తప్పుకుంటున్నది.

**యాప్ దుర్వినియోగమైతే చర్యలంటూ హుకూం**

ఎన్ఎంఎంఎస్ యాప్ దుర్వినియోగం చేసినా, అవతవకలకు పాల్పడినా అధికారులపై చర్యలు తీసుకోవాలని లేఖలో పేర్కొంది. ఏం చర్యలు తీసుకున్నారనే దానిపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖకు పంపాలని స్పష్టం చేసింది. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో ఎన్ఎంఎంఎస్ పర్యవేక్షణా విభాగాలు ఏర్పాటు చేసి దానికి ఐటీ మేనేజర్‌ను, ఒక నోడల్ అధికారిని నియమించాలని సూచించింది. యాప్ పనిచేస్తుందా? లేదా? నెట్ సిగ్నల్ ఉందా? లేదా? అనే దాన్ని ఫీల్డు అసిస్టెంట్లు ముందే చూసుకోవాలనీ, ఒకసారి గ్రామపంచాయతీ లాగిన్ నుంచి ఫొటో అప్‌లోడ్ చేసిన తర్వాత ఎలాంటి మార్పులు, చేర్పులు చేసే వెసులుబాటు ఉండదని స్పష్టం చేసింది. డాక్యుమెంటేషన్ కోసం జిల్లా స్థాయిలో హార్డు డిస్కులను అందుబాటులో ఉంచుకోవాలి. ఎన్ఆర్ఈజీఎస్ యాప్‌లో 15 రోజుల తర్వాత ఫొటోలు అందుబాటులో లేకుంటే హార్డు డిస్కులను జిల్లా కార్యాలయాల్లో అందుబాటులో ఉంచుకోవాలని సూచించింది. హార్డ్ డిస్కుల సాక్ష్యాలు కనీసం ఏడాది పాటుగానీ, సోషల్ ఆడిట్ అయ్యేవరకుగానీ అందుబాటులో ఉండాలని సూచించింది. ఉదయమే కాకుండా మధ్యాహ్న సమయంలోనూ కూలీల ఫొటోల అప్‌లోడ్ తప్పనిసరి అనీ, ఒక పూటనే ఫొటో అప్‌డేట్ చేస్తే సగం వేతనమే దక్కుతుందని స్పష్టం చేసింది. ఫొటో అప్‌డేట్ కాకపోతే కార్మికులకు వేతనం దక్కదు. తర్వాత రోజు అటెండెన్స్ వేసుకునే అవకాశం లేదని తెలిపింది. కానీ, దీని నిర్వహణ కోసం నిధుల కేటాయింపు ప్రస్తావనే లేదు.

## పోక్సో కేసులో నేరస్తుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

- రూ. 8 వేలు జరిమానా

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

బాలికపై లైంగికదాడి కేసులో నిందితుడికి కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. స్టేషన్ హౌస్ ఆఫీసర్ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌లోని కౌముర్ జిల్లా కొల్వావా పోస్ట్, అధౌరా పీస్, కన్వార్ గ్రామానికి చెందిన రంజిత్ సింగ్ (29) రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ జీహెచ్ఎంసి పరిధిలోని గగన్‌పహాడ్‌కు వలస వచ్చాడు. కూలి పని చేసుకుని జీవిస్తున్నాడు. ఇతను 2019లో బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. దాంతో ఆయనపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఈ కేసును విచారించిన రాజేంద్రనగర్ ఫాస్ట్‌ట్రాక్ ఎస్‌పిఎల్ కోర్టు.. నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.8 వేల జరిమానా విధించింది. బాధిత కుటుంబానికి రూ.3 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. శిక్ష ఖరారైన నేపథ్యంలో నేరస్తుడిని పోలీసులు జైలుకు తరలించారు.

SOUTH INDIA shopping mall

## సౌత్ ఇండియా షాపింగ్‌మాల్లో బ్లాక్‌బస్టర్ సేల్

**ప్రజాశక్తి - హైదరాబాద్**

దక్షిణాదిలో ఆషాఢమాసం సంస్కృతిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నట్లు సౌత్ ఇండియా షాపింగ్ తెలిపింది. ఈ నేపథ్యంలో 'షాపింగ్ కిలోల్లో... సంతోషం టన్నుల్లో' అనే నినాదంతో ఆకర్షణీయమైన పథకాన్ని ప్రకటించినట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. కంచిపట్టు చీరలపై అందిస్తున్న ఒక్క కిలో చీరల కొనుగోలుపై మరో కిలో చీరలు ఉచితంగా పొందవచ్చని వెల్లడించింది. అన్ని రకాల వస్త్రాలపై, సరికొత్త స్టాకుతో 66 శాతం వరకు తగ్గింపును ఇస్తున్నట్లు పేర్కొంది. అన్ని రకాల లేడీస్ వేర్, మెన్స్ వేర్, కిడ్స్‌వేర్ పై ఆకర్షణీయమైన ఆఫర్లు పొందవచ్చని తెలిపింది. ప్రతి గ్రాము బంగారు ఆభరణాల కొనుగోలుపై రెండు గ్రాముల వెండి ఉచితంగా ఇస్తున్నామని పేర్కొంది. కిలో వెండిపై రూ.ఐదు వేల తగ్గింపు పొందవచ్చని తెలిపింది. తమ పథకాలకు విశేష ఆధరణ లభిస్తుందని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ యాజమాన్యం తెలిపింది.

R.S. Brothers™
ANDHRA PRADESH | TELANGANA

## ఆర్ఎస్ బ్రదర్స్‌లో ఆషాఢమాసం కేజీ సేల్ ఆఫర్లు

**ప్రజాశక్తి - హైదరాబాద్**

కొనుగోలుదారుల అభిరుచులకు అనుగుణంగా తెలుగు రాష్ట్రాల్లోని తమ స్టోర్లలో ఆషాడమాసం కేజీ సేల్ ఆఫర్లను అందిస్తున్నట్లు ఆర్ఎస్ బ్రదర్స్ తెలిపింది. మహిళలు, పురుషులు, పిల్లలకు సంబంధించిన అనేక లక్షల వెరైటీ వస్త్రాలను ఈ సేల్‌లో 70 శాతం వరకు తగ్గింపు ధరలకు విక్రయిస్తోన్నట్లు పేర్కొంది. అలంకారి ప్రింట్ శారీ కొనుగోలుపై రూ.3,695 విలువ చేసే 2వ చీర రూ.39కే అందిస్తున్నట్లు వెల్లడించింది. బంగారు అభరణాల కొనుగోళ్లపై గ్రాముకు రూ.200 తగ్గింపును ఇస్తున్నట్లు పేర్కొంది. కేజీ వెండి వస్తువుల కొనుగోలుపై 5,000లు తగ్గింపునిస్తున్నామని వెల్లడించింది.

## థామ్సన్ నుంచి సరికొత్త టివీలు

**హైదరాబాద్ :** ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ థామ్సన్ భారత్‌లో 65, 75 అంగుళాల పరిమాణంలో సరికొత్త టీవీలను విడుదల చేసినట్లు ప్రకటించింది. ఇవి రెండు ఇన్ బిల్ట్ సబ్‌వూఫర్లతో 108 వాట్ల డాల్బీ అట్మాస్ ఆడియో, డాల్బీ విజన్, 122హెర్జ్ రిఫ్రెష్ రేట్, గూగుల్ టివి 5.0తో లభిస్తాయని తెలిపింది. జులై 18 నుంచి ఆన్‌లైన్‌లో లభిస్తాయని పేర్కొంది. వీటి ధరలను రూ.61,999, రూ.95,999గా నిర్ణయించింది.

## సంపంగి గ్రూప్‌నకు మంత్రి శ్రీధర్ బాబు ప్రశంసలు

**ప్రజాశక్తి - హైదరాబాద్**

తెలంగాణలో ఖర్జూర సాగును విజయవంతంగా చేపట్టి.. సేంద్రీయ వ్యవసాయం ద్వారా రైతులకు ఆదాయం, ఆరోగ్యం, ఆనందాన్ని అందించి గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించిందని ఆ సంస్థ అధినేత డాక్టర్ రమేష్ తెలిపారు.

ఈ సందర్భంగా రమేష్‌ను మంత్రి శ్రీధర్ బాబు అభినందించారు. ఈ సాధన రాష్ట్రానికి గర్వకారణమని, రైతులు స్థిరమైన వ్యవసాయం ద్వారా లాభాలు, ఆరోగ్యం పొందాలని మంత్రి సూచించారు. సంపంగి గ్రూప్ సేంద్రీయ వ్యవసాయంలో ఆదర్శంగా నిలిచిందన్నారు. గిన్నీస్ రికార్డు సాధించిన డాక్టర్ రమేష్‌కు అభినందనలని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.

## 21న బిఆర్క్ ప్రవేశాల నోటిఫికేషన్

- 23 నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ప్రారంభం
- షెడ్యూల్ విడుదల

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో బిఆర్క్ కోర్సులో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ ఈనెల 21న విడుదల కానుంది. గురువారం బిఆర్క్ ప్రవేశాల కమిటీ సమావేశాన్ని హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్‌లో నిర్వహించారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ వి బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మన్లు ఇటిక్యాల పురుషోత్తం, ఎస్‌కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, ఓయూ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి, బిఆర్క్ ప్రవేశాల కన్వీనర్ ఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బిఆర్క్ ప్రవేశాల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈనెల 23 నుంచి 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. పరిశీలన కోసం ఆన్‌లైన్‌లో ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల (ఎన్‌సిసి, సీఏపీ, వికలాంగులు, స్పోర్ట్స్)కు వచ్చేనెల నాలుగో తేదీన భౌతికంగా ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. అదేనెల ఏడున రిజిస్టర్ చేసుకున్న అభ్యర్థుల జాబితాను వెల్లడిస్తామని వివరించారు. 14న ర్యాంకులను కేటాయిస్తామని తెలిపారు.

అదేనెల 16 నుంచి 18 వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేయాలని సూచించారు. 20న సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. 21,22 తేదీల్లో కాలేజీల్లో రిపోర్టు చేయాలని కోరారు. 23న ఖాళీ సీట్ల వివరాలను కాలేజీలు కన్వీనర్‌కు పంపించాలని తెలిపారు. వచ్చేనెల 24,25 తేదీల్లో రెండో విడతలో వెబ్‌ఆప్షన్లను నమోదు చేయాలని పేర్కొన్నారు. 28న సీట్లు కేటాయిస్తామని తెలిపారు. 29, 30 తేదీల్లో కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేయాలని సూచించారు. 30న ఖాళీ సీట్ల వివరాలను కాలేజీలు కన్వీనర్‌కు పంపించాలని కోరారు. సెప్టెంబర్ ఒకటి నుంచి బిఆర్క్ విద్యార్థులకు తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు. ఒక యూనివర్సిటీ, ఎనిమిది అనుబంధ గుర్తింపు పొందిన కాలేజీల్లో కన్వీనర్ కోటాలో 508 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇతర వివరాలకు ఈనెల 21 నుంచి https://barchadm.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.



గద్వాల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

## పంటను కొనడంలో కార్పొరేట్ సీడ్ కంపెనీల దోపిడీ

- నడిగడ్డ సీడుపత్తి రైతుల ధర్నా

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

సహజమైన పద్ధతుల్లో పంటలు పండిస్తున్న పంటను కార్పొరేట్ సీడ్ పత్తి కంపెనీలు సిండికేట్‌గా మారి రైతులను దోపిడీ చేస్తున్నాయని నడిగడ్డ సీడు పత్తి రైతులు ఆరోపిస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా గురువారం గద్వాల జిల్లా కలెక్టరేట్ ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ.. కార్పొరేట్ సీడ్ కంపెనీల చేతుల్లో చిక్కి తమ భూములన్నీ నిస్సారంగా మారిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏడాదంతా కష్టం చేసి పండించిన పంటను కొనడంలో ఈ సీడ్ కంపెనీలు సిండికేట్‌గా మారి రైతులను దోపిడీకి గురిచేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీడ్ కంపెనీల ఆగడాలను తట్టుకోలేమని, ఈ కంపెనీలపై న్యాయవిచారణ జరిపి వారిని శిక్షించి, తమను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారిని శిక్షించే వరకూ తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఆందోళన చేస్తున్న రైతులకు మద్దతుగా గద్వాల అఖిల పక్ష కమిటీ నాయకులు నాగారుదొడ్డి వెంకట్రాములు, కురువ పల్లయ్య, రంజిత్ కుమార్, వివి నర్సింహ, ఇక్బాల్ పాషా, గోపాల్ యాదవ్, కృష్ణయ్య, రామిరెడ్డి, జాంపల్లి నర్సింహులు తదితరులు మద్దతు తెలుపుతూ వారితోపాటు ఆందోళనలో పాల్గొన్నారు. కాగా, కలెక్టర్‌తో జరిపిన చర్చల్లో.. సీడు పత్తి విత్తన రైతులు కోరిన విధంగా పండించిన పంటనంతా కొంటామని, రైతులెదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామని సీడు విత్తన ఆర్గనైజర్లు ఒప్పుకున్నట్టు అఖిలపక్ష నాయకులు తెలిపారు.

## పాలమూరుకు అన్యాయం చేస్తున్న సిఎం రేవంత్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. పాలమూరు బిడ్డను అని చెప్పుకుంటూనే సిఎం రేవంత్ రెడ్డి ఆ జిల్లాకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం యంగ్ ఇంటర్నేషనల్ స్కూల్ శంకుస్థాపనకు వస్తున్న సిఎం షెడ్యూల్‌లో పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు సందర్శన లేకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ఆ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రికి ఎందుకంత నిర్లక్ష్యమని ప్రశ్నించారు. నార్లాపూర్ పంప్ హౌజ్‌కు కేసీఆర్ నీళ్లు తెచ్చారనీ, మిగతా పనులు పూర్తి చేసి రైతాంగానికి నీళ్లు ఇవ్వాల్సిన భాద్యత రేవంత్‌కు లేదా? అని నిలదీశారు. మాజీ మంత్రి హరీశ్ రావు నిలదీస్తే తప్ప కల్వకుర్తి లిఫ్ట్‌లను ఆన్ చేయలేదని చెప్పారు. కొల్లాపూర్‌కు కెసిఆర్ మామిడి మార్కెట్‌ను కేటాయించారనీ, దానికి నిధులు కేటాయించి పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొల్లాపూర్‌కు కేటాయించిన హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలను వేరే చోటికి మార్చారనీ, దానిని తిరిగి కొల్లాపూర్‌కు కేటాయించాలని కోరారు. కెసిఆర్ మొదలు పెట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సీఎం కొల్లాపూర్ పర్యటనలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తికి చర్యలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసే చర్యలను ప్రకటించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే జి.జైపాల్ యాదవ్ మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పాలనలో ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేదని విమర్శించారు.

## ప్లాస్టిక్ రహిత సమాజం కోసంకృషి చేయాలి

- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ ఉద్యమం (ఎస్‌హెచ్‌జీ) మహిళా సాధికారత ఉద్యమమని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలో జరుగుతున్న ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సంబురాల్లో మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 38 విఒఎలకు స్టీల్ బ్యాంకులను పంపిణీ చేశారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ.. మంత్రి పొన్నం ప్రభాకర్ తన తండ్రి పేరు మీద పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి ఇలాంటి కార్యక్రమం చేస్తున్నానని చెప్పినపుడు.. చాలా సంతోషంగా అనిపించిందన్నారు. గ్రామాలు ఆరోగ్యంగా ఉంటేనే దేశం ఆరోగ్యంగా ఉంటుందని, నేటికీ అత్యధిక జనాభా గ్రామీణ ప్రాంతాల్లోనే నివసిస్తున్నారని తెలిపారు. ఇటీవల జరిగిన అందాల పోటీలు సందర్భంగా రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన భోజనం కార్యక్రమ సమయంలో ప్లాస్టిక్ రహిత కార్యక్రమం గురించి మంత్రి పొన్నం చెప్పారని గుర్తు చేశారు. స్టీల్ బ్యాంక్ ప్రభావం ఆటోమొబైల్, ఐటి విప్లవం కంటే గొప్పదని అభివర్ణించారు. ప్రతి మహిళా.. నాయకురాలుగా ఎదగాలని కోరుతున్నానన్నారు. స్టీల్ బ్యాంక్ రానున్న రోజుల్లో తెలంగాణలో ఊపందుకుంటుందని సంతోషం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాలో పర్యటించినప్పుడు అక్కడి మహిళల శక్తి సామర్థ్యాలు చూశానని అన్నారు. మానవసేవ చేయాలని సంకల్పించినప్పుడు అదొక ఉద్యమంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకయ్య, సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్, దాన కిషోర్, కలెక్టర్లు హైమావతి, పమేలా సత్పతి, స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ పాల్గొన్నారు.

## సచివాలయంలో బోనాల ఉత్సవాలు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో గురువారం బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. సచివాలయ ఉద్యోగుల సంఘం, నల్ల పోచమ్మ దేవస్థానం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బోనాలు సమర్పించారు. నార్త్ గేట్ నుంచి బాహుబలి గేట్ మీదుగా సౌత్ గేట్, పోచమ్మ దేవాలయం వరకు అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. డప్పు విన్యాసాలు, పోతరాజుల ప్రదర్శనలు కనువిందు చేశాయి. సచివాలయ అధికారులు, సిబ్బంది ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో సెక్రటేరియట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షులు గిరి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులు నవీన్ కుమార్, లావణ్య లత, జనరల్ సెక్రటరీ ప్రేమ్, అదనపు కార్యదర్శి రాము భూక్య, ఆలయ కమిటీ అధ్యక్షులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## బెంట్లే సిస్టమ్స్ అత్యాధునిక సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రదర్శన

**హైదరాబాద్ :** ప్రముఖ ఇంజనీరింగ్ టెక్ దిగ్గజం బెంట్లే సిస్టమ్స్ గురువారం హైదరాబాద్‌లో తమ అత్యాధునిక సాఫ్ట్‌వేర్ సొల్యూషన్‌లను ప్రదర్శించింది. ఇవి భారతదేశంలో మెట్రో, నీటి సరఫరా, విద్యుత్ రవాణా, ఎయిర్‌పోర్ట్ విస్తరణ, 3డి సిటీ మ్యాపింగ్ వంటి బహుళ రంగాల్లో విస్తృతంగా ఉపయోగించబడుతున్నాయని బ్రెంట్లే సిస్టమ్స్ సౌత్ ఏసియా రీజినల్ ఎగ్జిక్యూటివ్ కమలకన్నన్ తిరువది తెలిపారు. నగరంలో ఏర్పాటు చేసిన బెంట్లే ఇన్నోవేషన్ డేలో పాల్గొన్న కమలకన్నన్ అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తమ సాఫ్ట్‌వేర్ జల్ జీవన్ మిషన్, అమృత్ ప్రాజెక్ట్, నాగ్‌పూర్‌లో నీటి లీకేజీ తగ్గింపు వంటి కీలక ప్రాజెక్టులలో డిజిటల్ ట్విన్ టెక్నాలజీ ద్వారా ప్రణాళిక, డిజైన్, నిర్మాణం, నిర్వహణ దశలను సమర్థవంతంగా నిర్వహిస్తోన్నామన్నారు. నాగ్‌పూర్‌లో నీటి లీకేజీ తగ్గింపు వంటి ప్రాజెక్టులలో డిజిటల్ ట్విన్ టెక్నాలజీ ద్వారా ప్రణాళిక, డిజైన్, నిర్మాణం, నిర్వహణ దశలను సమర్థవంతంగా నిర్వహిస్తోన్నామన్నారు. విద్యుత్ రంగంలో ట్రాన్స్‌మిషన్ టవర్‌ల డిజైన్, నిర్వహణ, 3డి మోడలింగ్‌లో బెంట్లే సాఫ్ట్‌వేర్ ఉపయోగపడుతోందన్నారు.

## సైబర్ మోసాలపై ఎస్‌బిఐ అవగాహన కార్యక్రమం

**ప్రజాశక్తి - హైదరాబాద్**

ప్రభుత్వ రంగంలోని దిగ్గజ విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) హైదరాబాద్ సర్కిల్ తెలంగాణ వ్యాప్తంగా సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించింది. విద్యా సంస్థలు, ఎన్‌జిఒలు, కార్యాలయాలు, మాల్స్, మెట్రో స్టేషన్లు, పార్కులలో పౌరులకు డిజిటల్ భద్రత గురించి అవగాహన కల్పించే లక్ష్యంతో గురువారం కోఠిలోని లోకల్ హెడ్ ఆఫీస్ నుంచి మూడు మొబైల్ పబ్లిసిటీ వ్యాన్లను ఆ బ్యాంక్ సిజిఎం రాధాకృష్ణన్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ వ్యాన్లు రాష్ట్రవ్యాప్తంగా సైబర్ మోసాల నివారణపై ప్రచారాన్ని కల్పిస్తాయి.

## జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషాకు సిఎం అభినందనలు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో:** విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల్లో దేశంలోని 50 అత్యుత్తమ జిల్లాల్లో చోటు సంపాదించుకున్న జనగామ జిల్లా రిజ్వాన్ బాషాను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభినందించారు. ఆయన ఆదర్శనీయుడని ప్రశంసించారు. ఈ మేరకు గురువారం సిఎం రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. తెలంగాణ రాష్ట్రం నుంచి జనగామ జిల్లా చోటు సంపాదించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా అధికార యంత్రాంగం పని చేస్తే ఫలితాలు అద్భుతంగా ఉంటాయనడానికి ఈ విజయం నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

## అశ్వరావుపేటలో యూకో బ్యాంక్ కొత్త శాఖ ఏర్పాటు

**ప్రజాశక్తి - హైదరాబాద్**

ఖమ్మం జిల్లాలోని అశ్వరావు పేటలో తమ నూతన శాఖను ఏర్పాటు చేసినట్లు యూకో బ్యాంక్ తెలిపింది. ఈ కొత్త శాఖను ఆ యూకో బ్యాంక్ తెలంగాణ జోనల్ మేనేజర్ ఎన్ శ్రీకాంత్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ ప్రాంతంలోని పేద, బలహీన వర్గాల ఆర్థిక ఉన్నతికి, ఉత్తమ కస్టమర్ సేవలను అందించడానికి ఈ శాఖను ఏర్పాటు చేసినట్లు ఆ బ్యాంక్ తెలిపింది. తమ బ్యాంక్ అతి తక్కువ వడ్డీ రేటుకు రుణాలు అందిస్తుందని శ్రీకాంత్ తెలిపారు. యూకో బ్యాంక్ మొబైల్ బ్యాంకింగ్ యాప్ అత్యధిక రేటింగ్ పొందిన యాప్ అని పేర్కొన్నారు. బ్రాంచ్ మేనేజర్ గోపి తమ బ్యాంక్ కొత్త పథకం యూకో ఆశ్రయ గురించి ఖాతాదారులకు వివరించారు.

## నాలుగేళ్లలో ఆరు లక్షల 'టాటా పంచ్'ల ఉత్పత్తి

**ముంబయి :** ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ టాటా మోటార్స్ తమ టాటా పంచ్ కార్ల ఉత్పత్తి ఆరు లక్షల యూనిట్ల మైలురాయికి చేరిందని తెలిపింది. దీన్ని అక్టోబర్ 2021లో పరిచయం చేశామని ఆ కంపెనీ ప్రతినిధి వివేక్ శ్రీవత్స తెలిపారు. 2024లో అత్యధికంగా అమ్ముడైన కార్లలో టాప్‌గా నిలిచిందన్నారు.

## రెండు నెలల్లో బాధ్యులపై చర్యలు

- బాధితులకు ఒక్కొక్కరికి రూ.1,25,000 పరిహారం
- సిఎస్‌కు రాష్ట్ర హెచ్ఆర్‌సి ఆదేశం
- గడువు ముగిసిన వ్యాక్సిన్ల కేసులో కమిషన్ తుది ఉత్తర్వులు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

2014లో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో గడువు ముగిసిన వ్యాక్సిన్లను రోగులకు ఇచ్చిన ఘటనలో పలువురు బాధితులుగా మారారు. వారిలో 16 మంది రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కు ఫిర్యాదు చేశారు. సుదీర్ఘ విచారణ తర్వాత ఈ ఘటనకు దారితీసిన నిర్లక్ష్యానికి బాధ్యులైన అందరిపైనా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశిస్తూ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ షమీమ్ అక్తర్ అధ్యక్షతన కమిషన్ తుది ఉత్తర్వులు జారీ చేసింది. గడువు ముగిసిన హెపటైటిస్- బి వ్యాక్సిన్లను నిర్లక్ష్యంగా వేశారని 16 మంది కమిషన్‌కు 16 మంది ఫిర్యాదు చేయడంతో పాటు కమిషన్ ఈ ఘటనను సుమోటోగా స్వీకరించి విచారించింది. హక్కుల పరిరక్షణ చట్టం, 1993 సెక్షన్ 18 ప్రకారం బాధితులకు ఒక్కొక్కరికి రూ.1,25,000 నష్టపరిహారం చెల్లించడంతో పాటు, ఔషధాల సేకరణ, నిర్వహణ ప్రక్రియలో దిద్దుబాటు చర్యలు తీసుకుని మరింత జాగ్రత్త వహించాలని సూచించింది. ఈ సంఘటన బాధితుల ఆరోగ్యం, గౌరవానికి సంబంధించిన మౌలిక హక్కులను తీవ్రంగా ఉల్లంఘించిందని కమిషన్ అభిప్రాయపడింది. వ్యవస్థాగత లోపాలను గుర్తించి, ఆస్పత్రి సూపరింటెంట్‌తో పాటు బాధ్యత వహించవలసిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసింది. సిఫార్సులన్నింటిని రెండు నెలల్లో అమలు చేయాలని ఆదేశించింది.

ఈ ఘటనకు సంబంధించి మొత్తం 16 మంది ఫిర్యాదు చేయగా అందులో ఆరుగురు ఎ.ఎన్.ఆదిలక్ష్మి, ఎస్.దేవమణి, టి.సతీష్, పి.మల్లికార్జున్, టి.రవి, జి.ధనుంజయ్ వ్యక్తిగతంగా కమిషన్ ఎదుట హాజరై తమ వాదన వినిపించారు. గాంధీ ఆస్పత్రి ఎఆర్‌టి, సిఒఇ రీసెర్చ్ ఫెల్లో డాక్టర్ టి.తారాదేవి వీటిని వేసినట్టు తెలిపారు. తద్వారా తాము మానసిక ఒత్తిడి, కడుపునొప్పి, ఒళ్లునొప్పులు తదితర దుష్ప్రభావాల బారిన పడ్డామనీ, పూర్తి స్థాయిలో విచారించాలని కోరారు. 2014 సెప్టెంబర్ 16న కమిషన్ ఘటనకు సంబంధించి నివేదికను సమర్పించాలని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించింది.